# తాటి చెట్టు

ఆవిడతో తిరుగుతున్నావేం? యేవన్నా లాభాలు చూపిస్తున్నదా? అనడిగింది సుశీల.

స్నేహంగా వుంటుంది. కలుపుగోలుతనంగా వుంటుంది. ఈ పేటలోకల్లా ఆవిడే అందర్ని చూసివస్తూ, పరామర్శిస్తూ, వుంటుంది. ఇల్లో నారాయణమ్మగాదు. మేం తిరిగితే నీ కసూయెందుకూ? నాకేవన్నా స్నేహితులేర్పడగానే కేవలం నాకోసమేవరన్నా రాగానే, మాఆయనకి అలాగే అసూయ కలుగుతుంది నేనే తెలివిగల వాడినన్నట్లు వాళ్ళతో చనువుగా మ్లాట్లాడి, తన కోపం వచ్చేట్టు చేయగలుగుతారు.

తాటిచెట్టు కింద నించుని పాలు తాగినా "కల్లే తాగావు" అంటారు. ఆమె వూరికే యెవరితోను నేస్తం కట్టదు. విడిపోయి విడాకులడగే వరకూ తీసికెళ్ళగలదు. పిచ్చి సుజనా! నేను అనుభవం మీదే చెబుతున్నానోయీ. మెరిసేదంతా బంగారంగాదు. సుజనా, ఆవిడ చలాకీ తనం రంగు చూసి మోసపోకు. మళ్లా హెచ్చరించింది సుశీల.

కల్లే అన్నా, నేను కల్లు తాగను గదా. పాలే తాగుతాను నాకు తల తిరగదు. రోడ్డుమీద బడి పొర్లాడను. నేను బంగారం కోసం అలమటించే దానిలాగా కనబడుతున్నానా? నా వంటి మీదెంతబంగారం కనబడుతున్నది.. విడాకుల వరకూ యెలా తీసికెళ్ళగలదోయీ పిచ్చి సుశీలా? నాకులా లేదు. మా వివాహం

పెద్దలు నిశ్చయించి జరపలేదు. మాది ప్రేమవివాహం ప్రేమే దైవము. దైవమే మమ్మల్ని కలిపాడు. నాకుచట్టంలో నమ్మకం లేదు. గెలిచినవాడు బయట నవ్వితే, వోడినవాడు ఇంట్లో నవ్వు తాడని సామెత. నువ్వు వినలేదేమొ నవ్వుతూనే అన్నది సుజన

నీతో నే వాదించలేను సుజనా. వాదించినా గెలవను. నీది వితండవాదం. పోన్లే నాకెందుకూ. అప్పు అయిదొందలు యివ్వ గలనన్నావు. చే బదులిస్తే నేపోతా. నీ మొహం యెర్రబడింది చేయి జాపింది సుశీల!

సుజన యిచ్చిన అయిదు వంద నోట్లు అందుకుని వెళ్ళి పోయింది. సుజన లోపలికెళ్ళి తలుపేసుకున్నది.

## 2

నీ స్నేహితురాలేదీ? వక్కతివే వచ్చావేం? విడివిడిగా కనిపించరే మీరిద్దరూ? కజ్జాలాడుకున్నారా? అదంతేలే. బాగా లాభసాటిగా కనబడకపోతే చెయ్యి కాల్తున్న గరిట నొదిలేసినట్టు వదిలేస్తుంది. యెరగనట్టు చూస్తుంది. నవ్వుతూనే అన్నది లక్ష్మణ్. అవిడ సెక్రటరీ. విడో, చామనచాయ. పట్టుచీరలే కడుతుంది, పట్టు జాకెట్లేస్తుంది.

వక్కతెనే రాలేదండీ ఇద్దరం గబగబా నడచి వస్తుంటే, చేతుల్లో బరువైన సంచీలు చూసి మీఅబ్బాయి కారాపి యెక్కిం చుకొచ్చాడు. నా స్నేహితురాలేమిటీ? మీకూ ఆమెతో స్నేహ మున్నదే మీరిద్దరూ జతగా తిరుగుతుంటే నేనూ చూశా. నేను మీలాగా అనలేదే. ఆమెకు చెలికత్తెలు చాలామంది వున్నారు.

నా ప్రత్యేకతేమున్నది? ఆమె రోడ్డుమీద నిలబడి మీ అబ్బాయికి ధన్యవాదాలు చెపుతున్నది. అదుగో వచ్చేసింది. కుట్టి వున్న దుస్తుల మూట బల్లమీదుంచింది సుజన.

వాళ్ళంతా రెడ్‌క్రాస్ మెంబర్స్. హాస్పటల్‌లో వున్న పేద రోగులకి లాల్చీలు, పైజామాలు కుట్టారు. లెక్కపెట్టి చూపింది సుజన.

మిసెస్ లక్ష్మణ్! ఇవి పాత బట్టలు. దసరాకి పేదలకి పంచేందుకు సేకరించి తెచ్చాను. నేను వెళ్లాలి. నేనింకా ఆఫీసర్ల యిళ్ళకి వెళ్లాలంటే మీ అబ్బాయి తీసికెళ్తానన్నాడు. వస్తా. రా ప్రదీప్! అని లక్షణ్ కొడుకుని లాక్కెళ్ళింది రాజూ పండాలే.

అటేచూసింది లక్ష్మణ్. తలతాటించి పెదిమలు విరిచింది.

మరో బేల్ పూడదీస్తారా? డ్రాయర్లు, చొక్కాలు యెన్ని తీయొచ్చో చెబుతాను కట్‌చేసి యిస్తాను.

గాడ్రేజ్ బీరువా వేపు వెళ్ళింది సుజన. కీ వేళ్లాడుతున్నది. తాళం తీసి తలుపు తీసి అన్నీ సద్దింది. కొత్తవి అందులో అమర్చింది. తాళం వేసింది.

కాలి మెషిన్ పనిచేస్తున్నదా లేదా చూసింది. నూనెవేసి అంతా శుభ్రం చేసింది.

బిలబిలమంటూ ఇంకా మెంబర్సు వచ్చారు. డి.ఐ.జీ. భార్య జేబున్నీసాబేగం చొరవగా బేల్ పూడదీస్తున్నది. లాయరుగారి భార్య టేపు,కత్తెర తెచ్చింది. సబ్ జడ్జిగారి భార్య ఏంబ్రాయిడరీ చేసిన రుమాళ్లూ, దిండు గలీబీలు తెచ్చి లెక్కచూపింది

ఎడిషనల్ కలెక్టరుగారి భార్య అంచుకుట్టిన దుప్పట్లూ, పిల్లలకు కట్టే నాప్‌కీన్లు తెచ్చింది. హాస్యాలాడుతూ పనిచేస్తున్నారు. అది హెల్త్ సెంటర్.

మీ అబ్బాయిని తాటిచెట్టుతో తిరగ నిస్తున్నావేం లక్ష్మణ్

నే వద్దనే చెప్పా. అదే చొరవగా లాక్కెళ్ళింది.

సుజనా! మీ ఇద్దరికీ చెడిందా? ఒక్కతివేవచ్చావా? యెలా వచ్చావు? చాలా దూరమే.

చెడలేదండీ. మీకు తెలియదేమో! తాటిచెట్టు చాలా ఉప యొగకరం. తాటాకులతో పాకలు నేస్తారు, చాపలల్లుతారు, బుట్టలు గిలకాయల్లు, విసనకర్రలు, చేతి పనులకు పనికి వస్తాయి. తాళపత్రి గ్రంధాలిప్పటికీ వున్నాయి. కవిలె కట్టలు ఇప్పటికి వున్నాయి. మెషిన్ రన్ చేస్తు అన్నది సుజన.

ఆ చెట్టంటే గౌరవమనే చెపుతున్నావు సుజనా.

తాటి దూలంతో ఇల్లు కడతారు. నాల్గునిట్రాళ్ళ ఇల్లు. అంటారు. పంట కాలువలు దాటడానికి బల్లలాగా వేస్తారు. తాటి కల్లు, తాటితాండ్ర, తాటిబెల్లం అయుర్వేద ఔషధాల్లోకి పనికి వస్తాయి. మా అమ్మ, మా అక్క బాలింత అయితే తాటిబెల్లంతో కారం తట్టె అని తయారు చేసి తినిపిస్తుంది. నడుం గట్టిపడుతుం దిట. తాటి ముంజె లెంతతీపి. తేగలు కాల్చి తింటారు. బుర్ర గుంజెంత తీపి. కుట్టుతూనే నవ్వుతూ చెప్పింది సుజన.

నీకింకా ప్రపంచం తీరుతెన్నులు తెలియవు అన్నదో సభ్యురాలు. పని జరుగుతూనే వున్నది.

కారు హారన్ వినబడింది. రాజూ సుడిగాలిలాగా వచ్చింది. గుడ్డల మూటలు చూసి రంగులు మార్చారందరూ పూసరవెల్లుల్లా

ఇవి ఆడపిల్లల బళ్లో టీచర్ల కిచ్చానే. అవీ ఇవీ పాతవి ఇమ్మని తెచ్చాను. మనకేమి కావాలో చెబితే చేయిస్తానన్నాడు. కోశాధికారి కొండ్రలావు. నిరుపేదలకి పంచేందుకు సాంబారు అన్నం పొట్లాలు కట్టించమని చెప్పి వచ్చాను. జాతీయ గీతాలు పాడి చూస్తున్నారా? మనకోసం పేణీలు, పులిహోరా, కాఫీ, చేయ మన్నాను. అందరినీ చూసి నవ్వుతూ చెప్పింది.

సుజనకి జాతీయగీతాలు చాలావచ్చు పాడి వినిపించింది నేను రికార్డు చేశాను. అన్నదో సభ్యురాలు.

లక్ష్మణ్ గాస్ అయిపోతే నిండా పోయించాను. పద సైదు లీటర్స్. ప్రదీప్ చాలాబాగా డ్రైవ్ చేశాడు. త్వరగా వచ్చేశాం చూశావా. ఇంకా పన్నెండు గాలేదు.

మీరు వాడినిపాగిడి పాడుచేస్తున్నారు. వాడికింకా లైసెన్సు రాలేదు. అందుకే వద్దనేది.

నే తెప్పిస్తా లైసెన్సు. 'యల్' అని యెర్రరంగుతో రాసి అట్ట కట్టితే లైసెన్సు యిచ్చినట్టే. నేనే కట్టాను అట్ట.

అందరూ నవ్వారు.

యెన్నాళ్లు మోసం చేయగలవు? ప్రదీప్‌కి పదహారే వయస్సు.

యెవడడ్డగిస్తాడో చూద్దాం. సుజనా! మీ అయన్నడిగి జీప్ తీసుకురా. అందరూ నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

3

సుజీ డియర్! గవర్నమెంట్ నౌకర్నియింటికి పిలిపించు కుంటున్నావని ఆఫీస్‌లో చెప్పు కుంటున్నారు. 'అమ్మగారు రమ్మన్నారు అని చెవుతున్నాడట. యేమేం పన్లు చేయిస్తు న్నావూ వాడిచేత? నీకు ప్యూన్ని పిలిపించుకునే అధికారం లేదు అని చెప్పాను. ఫొటోలు తీసి పై అధికారికి పంపుతారు.

యేవీ ఫొటోలు. వాడే యిబ్బందిగా వున్నది. పనిచేసి పె డతానని దణ్ణాలు పెడితే సరే చేయమన్నా సుజన బెల్ కొట్టింది తిరువతిరావ్ అని కేక వేసింది.

మేడ మెట్లు దిగి వచ్చి యెదురుగా నిలబడ్డాడు నౌకరు తిరువతిరావు. సన్నగా పొడుగ్గా, నల్లగా వుంటాడు.

నువ్వు వున్నపళంగా పని మానేసి వెళ్ళిపోవాలి. అని వురిమింది సుజన.

తవుఁరికినేను నూరురూపాయలు అవ్వున్నాను. తీర్చలేను పనిచేసి తీరుద్దామని కుదురుకున్నాను. ఇకిలిస్తూ, చేతులు నలు పుకుంటూ నిలబడ్డాడు.

తీర్చక్కర్లా కొట్టేశాలే. పో, మరిరాబోకు. నేరమ్మన్నానని పనిలో పెట్టుకున్నానని నామీద నేరమెక్కింది. నౌకరు దణ్ణంబెట్టి వెళ్ళబోయాడు.

వాడికి అప్పు యెందుకిచ్చావు? వడ్డీ వ్యాపారం చేస్తున్నా వా? మొగుడు పరంధామ్ నవ్వాడు.

వడ్డీ కాదు బాబూ, చే బదులిచ్చారమ్మగారు. మా భార్యా మణికి గర్భం పోయి పేణం లేకుండా పడిపొతే వచ్చి చెప్పుకు న్నాను బాబూ. మందులు కొనాలని చెబితే అప్పు యిచ్చారు మా భార్యరత్నం యిప్పుడు లేచితిరుగుతున్నది. దణ్ణం పెట్టాడు.

బూట్లు పాలిష్ చేస్తున్నట్టూ, గిన్నెలు తోముతున్నట్టూ, యిల్లు చిమ్ము తున్నట్టూ, బట్టలుతికి ఆరేస్తున్నట్టూ ఫొటోలు తీశారు నీకు. పనిమనిషి వుండగా నువ్వెందుకు చేశావు అవన్నీ. పరంధామ్ అడిగాడు.

పని మనిషి నీరాడి కొడుకుని కని రావటం లేదు బాబూ. మా పక్కిల్లే దానిది. నువెల్లు అంటే వచ్చినాను. అది రాగానే నేను మానేద్దామనుకొన్నాను బాబూ. ఆ ఫొటోలో వున్నది నేను గాదు బాబు. మా చిన్నాన్న కొడుకు. నావల్లనే వుంటాడు. ఆడు తీయించుకున్నాడవన్నీ, నాకూయిచ్చినాడు కాపీలు. అని జేబులోంచి ఫొటోలు తీసి నవ్వుతూ చూపించాడు.

యేమంటారు అన్నట్టు చూసింది సుజన,

నౌకరు వెళ్ళిపోయాడు.

జీపొకసారివ్వరూ మేము,రెడ్ క్రాస్ మెంబర్సుము హాస్ప టల్లో రోగులకి పండ్లూ, పాలూ, బిస్కట్లు పంచి రావటానికి వెళ్లాలి. తిరిగి రావాలి. సుజన అడిగింది.

మేము సుంకోసుల వెళ్లాలి. డైరెక్టర్‌ని తీసికెళ్ళి డామ్ చూపాలి హెల్తు సెంటర్స్, నర్సు ట్రైనింగ్ స్కూల్ చూపాలి. ఆవిడే పర్సన్స్‌ని సెలెక్టు చేసేది.

మధ్యాహ్నం భోజనాలైపై. రెండయింది. సుజన బెడ్ రూమ్‌లో నిద్ర తీస్తున్నాడు. కలత నిద్రే.

హాలులోంచి మాటలు వినబడుతున్నాయి.

రాజూ వచ్చింది. ఆశీనురాలైంది.

మిస్టర్ పరంధామ్! మేము అలా తిరిగి హాస్పటల్‌లో, కేరాఫర్ హోమ్‌లో, గిరిజన హాస్టల్లో, హెల్త్ సెంటర్స్‌లో, చిల్డ్రెన్ వెల్‌ఫేర్ సెంటర్స్‌లో, కొత్తగా నడుపబడుతున్న వద్ధుల ఆశ్రమములో, శిశుకుంజ్‌లో. కుష్ఠురోగ నివారణ ఆశ్రమములో తిండీ, గుడ్డ పంచిరావాలి. బత్తాయిలూ, బిస్కట్లు, పాతబట్టలూ తీపి, ఫుడ్ పేకట్స్, మందులు, పలక బలపం అన్నీ ముష్టెత్తి తెచ్చాం. మీరేమీ యివ్వక్కర్లేదు. జీపు యివ్వాలి. నేనే డ్రైవ్ చేస్తా. రేడ్‌క్రాస్ మెంబర్స్‌ని మంత్రాలయ కమిటీవారు ఆహ్వానించేరు. వాళ్లు దళిత, స్త్రీ, బాల ప్రాథమిక విద్యాకేంద్రం ప్రారంభోత్సవం చేస్తున్నారు. కలెక్టర్ గారి భార్య, సబ్‌జడ్జి శామ్ భామానీ గారి భార్య, అడ్వోకేటు జిలానీ భార్య యస్.పి. భార్య, డి.ఐ.జి. భార్య హైదర్‌బేగం కార్లు తెస్తారనుకోండి. అవి చాలవు. మీభార్యానీ మాతో పంపాలి, చాలాపనుంది. ఇగ్నిషన్ కీస్‌యేవీ? నాకు మరో పనుంది. పోవాలి. లేచి నిలబడి చేయిజాపింది రాజు.

అందమైన విగ్రహం, కళ్ళు మెరిసే మేకప్. చొరవః అధికారం చూసి పరంధామ్ జీపు తాళాలు పైకి తీశాడు. వాకిట్లో రన్నవుతున్న కారునుండి డ్రైవర్ ఇబ్రహీమ్ దూకి వచ్చాడు. రాజూ కారు తాళంచెవి అందుకుని అతనికిచ్చింది. ఆమె యెక్కగానే కారు రివ్వున దూసుకుపోయింది.

## 4

"యేదీ నువ్వు పట్టిన లంచం? ఇటియ్యి. వాపస్‌చేయాలి. ఇలా యెంతమంది దగ్గర వుద్యోగాలిప్పిస్తానని లాగుతున్నావు? ఆమెతో తిరుగుతూ ట్రైనింగ్ అయినావా? యెవరెవరితో ఆ లంచం పంచుకుంటున్నావూ? నీ వంతు యెంత? నువ్వు ప్రభుత్వ వాహనాల్లో తిరగరాదని చెప్పానా? ఆమెతో తిరిగినా పైసలిచ్చాను, తిండి పెట్టాను. టీ యిచ్చాను. వూరికే వాడుకున్నానా డ్రైవర్ని? అని డబాయిస్తుంది. నీకదీ రాదు. మార్కెట్ దగ్గర నువ్వు ప్రభుత్వ వాహనంలోంచి దిగుతుంటే ఫొటో తీశారు. ఒకవేళ ఆమె బలవంతం చేస్తే వెళ్ళావనుకో ఆమె తత్త్వం తెలుసు గదా, వింటూనే వున్నావు నేర్పుగా దూరానే ఆపించి దిగిపోలేవూ? అది కూడా నేనే నేర్పాలా?" పరంధామ్ మంద్రస్వరంలో దీర్ఘాలు తీస్తూ అంటున్నా, అతని మొహం యెర్రబడింది. అసలే మనిషి యెరుపు. దానిమీద కోపం, వుక్రోషం వల్ల యింకా కెంపు రంగుకి తిరిగింది. చెవులూ యెర్రబడినై. కళ్ళు మాత్రం నవ్వుతున్నై.

సుజన వడ్డన చేస్తున్నది. అతిథులెదుటైనా సరాగం? అని బాధపడింది. ఆమె పైకి తేలదు.

"మీరు నిజంగా పురుషులైతే, అన్న ప్రతీ మాటా ఋజువు చేయాలి. అత్తగారి పాత్ర తీసుకుని నిందలు వేస్తే గాదు. అంత లంచమే పడితే, చీరలు కొనుక్కోనా? ఈ ధర్మవరం చీర, జరీ లేనిది మీరు కొనిచ్చి మూడేళ్ళయింది. రెండు కాశ్మీర్ సిల్క్ చీరలు కొనిచ్చి అయిదేళ్ళయింది. అతిథులు రానప్పుడు యెనిమిదేళ్ళనాటివి నూలు చీరలు, వాయిల్ చీరలూ

ఫాడుకుంటాను. చుట్టాలూ, అతిధులూ వచ్చినప్పుడూ, యేదైనా పేరంటానికి, ఫంక్షన్‌కీ ధర్మవరం, కాశ్మీర్‌వీ వాడుతాను. నేనే శుభ్రం చేసుకుంటుంటే అవి చిరిగిపోలేదు." అలా నవ్వుతూనే అంటిస్తూ, వడ్డన పూర్తి చేసింది. అన్నీ అందు బాటులో వుంచింది. తానూ బల్లముందు కూచున్నది సుజన.

అతిధులిద్దరూ జీవితభీమాసంస్థ యేజెంట్లు, స్నేహితులూ వరంధామ్ ద్వారా పాలసీలు యిప్పించారు. వీళ్ళిద్దర్నీ చూసి నవ్వుతున్నారు.

"హాస్యాలాడుతున్నారండీ వరంధామ్. మీరంటే చాలా గౌరవం. చదువుకున్నారనీ యేదడిగినా చెపుతారనీ చెప్తారు. ప్రజ్ఞ రాణించక తగినంత పేరు రావటం లేదంటారు. మొహం యెదట పొగడరాదని, వుడికించి వినోదిస్తారు. వెన్నవంటి మనసు. వారి సాయంతోనే మేము యిరవై లక్షల విలువ గల పాలసీలు అమ్మగలిగాము." మహేంద్ర అన్నాడు.

రెండోమారు వడ్డించుకుంటున్న వరంధామ్ అన్నాడు. "అయ్యో! లేడీస్‌క్లబ్‌లో సభ్యుల్లో వృద్ధులకి పురాణ శ్రవణం చేస్తోంది. భాగవతారిణిలాగా దండ వేయించుకుని, గజ్జె కట్టి, చిడతలు పట్టి గంతులేస్తు రక్తి కట్టిస్తుందిట. చాలామంది మెచ్చి హారతి పళ్ళెంలో డబ్బులేస్తున్నారుట. శ్రీమద్రమా రమణ గోవిందో హరిః' అని వృద్ధ స్త్రీ సభ్యురాళ్ళంతా లేచి నుంచుని దణ్ణాలు పెడతారట హారతికి. యెంత పోగవుతుంది దక్షిణ సుజీ!" నవ్వుతున్నాడు వరంధామ్. బోండా తింటున్నాడు.

సుజన నొచ్చుకోక తానూ పాల్గొన్నది. హాస్యమాడింది. "యెంత పోగయినా అదంతా క్లబ్‌కి, కుర్చీలు, బల్లలూ, పింగాణీ వళ్ళేలు, గాజు గ్లాసులు, కప్పులూ సాసర్లు, టేబుల్ క్లాతులూ కొంటానికి వాడతారండీ. ప్రెసిడెంటూ, సెక్రెటరీ కోశాధికారీ వున్నారు. నన్ను కాజేయనీయరు. మీరు వుద్యోగాలు సంతర్పణ చేయటం లేదు. అదాయవ్వన్ను యెగ్గొట్టే పాలసీలు, భీమాలూ చేయించటం లేదూ? రాజూ వచ్చి సమ్మోహనాస్త్రం వేస్తుంది. రెఫ్యూజీస్ అని కొందరికీ, బహు కుటుంబీకులని కొందరికీ, వుద్యోగాలిప్పిస్తుంది మీ ద్వారా. తాటి చెట్టెక్కి ఆకులు కోసి, పాకలు వేసుకోమని కింద రాలుస్తారు చూడండీ, అలాగే యీ నెరదాత తేలిగ్గా పనులు చూపిస్తారు. తాటిచెట్టెక్కటం సులభం కాదనుకోండి. దానికి నేర్పు కావాలి. యెందుకులే మగమహారాజని చూస్తున్నా. యేడిపించట మెంతసేపూ. రాత్రి పదిన్నరా, ఆపైనా వచ్చి కల్లు పోస్తున్నట్టు బాగా వుచ్చేస్తుంది. తలుపు వేసున్నా నాకు వినబడుతూనే వుంటుంది రాజూ గొంతు. మూరెడు టార్చిలైట్, యెదంత కుక్కా కాపాడుతాయి అనుకుంటున్నది. యెప్పుడూ గెలిచేసేవాడూ, తప్పు పట్టేవాడూ యేమౌతారో తెలుసా? డస్ట్ బిన్‌లోకి పోతాడు. 'యెప్పుడు తప్పులు వెదకెడు అప్పురుషుని గొల్వగూడదు' అన్నారు. మంచి భోజనం పెట్టాను. కడుపు నిండా తిని పొండి." అన్నది సుజన. తాను లేచింది.

వాళ్ళు తలలు వంచి భోజనం పూర్తి చేశారు.

## 5

శారదా జయిన్‌కి పెద్ద ఆపరేషన్ జరిగిందనీ, హాస్పటల్లో వున్నదనీ తెలిసి, సభ్యులు చూడటానికి వెళ్ళారు. యెనిమిదో

మాసంలోనే నెప్పులొచ్చి, స్రావం మొదలైతే, బిడ్డబతికి లేదనీ, శస్త్రచికిత్స చేసి తీసేసి తల్లిని బతికించారు. జనరల్ వార్డ్‌లోనే వున్నది శారద. మంచం మరలు తిప్పి అనుకూలంగా వుంచారు. తలవేపు పల్లం, కాళ్ళు జావలేదు. పట్టుకుపోయాయిట. తలవేపు కొద్ది యెత్తు వుంచారు. ఆమె భర్త వ్యాపారం చూసుకుంటూ రాజకీయాల్లో పాల్గొంటాడు. కంట్రాక్టర్ ఇద్దరికీ వయుస్సు యెక్కువే శారద స్టెనోలాగా తమ ఆఫీస్‌లోనే పని చేస్తున్నది. మగబిడ్డ పుట్టలేకే పోయాడు.

అన్ని వేపులా కుర్చీలు వేయించి కూచున్నారు సభ్యులు. లక్ష్మణ్ వోదార్చింది. "ఆపకుండా యేడవ్వకు. ఒళ్ళు నెప్పులొస్తాయి. మరొక బిడ్డ కలుగుతాడు. ఆడపిల్లలూ పిలుపైన వాళ్ళే. ఇప్పుడాడ పిల్లలకూ ఆస్తిలో భాగం వస్తుంది. వాళ్ళూ మగబిడ్డలతో సమానమే అనుకోవాలి. నీకున్నది, నీ బిడ్డలకే చెందుతుంది. దిగులుపడకు." అని శారద తలమీద రాచి కన్నీరు తుడిచింది.

"రాజూ రాలేదూ? మాకెక్కడా అందలేదు. ఇంతవరకూ అందర్నీ కలుపుకుని వెంటబెట్టుకు రావటం రివాజు ఆమెకి." తెచ్చిన పళ్ళూ బిస్కట్లూ షెల్ఫులో సర్దింది.

"యెలా వున్నది శారదా? నెప్పి తగ్గుతున్నదా?" మరొకామె అడిగింది. నుదుటిమీద రాచింది.

"తగ్గుతున్నది. జ్వరం లేదు. రాజూ యేదో కేసులో యిరుక్కున్నదనీ, దాన్నుండి బైటపడాలని ప్రయత్నిస్తు

తెగ తిరుగుతున్నదనీ. 'తీరిక లేక రాలేక పోయాననీ వీలు చిక్కగానే వచ్చి చూస్తా'నని చెప్పమన్నదిట. క్లబ్ నౌకరు సీత, పిల్లలకి పాలు కలిపి పోస్తుందే, అది వచ్చి చెప్పింది. అది వాళ్ళింట్లో సాయానికి వెళ్తుందట." శారద నెమ్మదిగా చెప్పింది.

"మీదాకా రాలేదా యింకా? స్మగ్లర్స్‌కి సహాయం చేసి తప్పించుకు పోనిచ్చిందని నేరం యెక్కింది. దాడి జరగ బోతున్నదని టిప్ అందిందిట. టైమ్ లేదు. తనున్న ఫ్లాట్ నుంచి పక్క కట్టడానికి బల్ల వేయించిందిట. దాటాక బల్ల తీసేసి అమ్మేసిందిట. "ఓ సభ్యురాలు మెల్లిగా చెప్పింది. "యేమీ చేయనిదే, దాని పర్స్ యెప్పుడూ వుబ్బి యెట్లా వుంటుందీ? అన్నిరకాల చీరలెలా కడుతుందీ? కాలు కింద మోపకుండా కార్లలో తిరుగుతుంద. మంచి నేర్పరి. మాటకారి. ఇప్పుడిహ పీకలమీద కొచ్చింది. పరపతివున్న వాళ్ళని దర్శించుకు రావాలి. శత్రువులను దారికి తేగలదు. కళలు మారుస్తుంది" అరవింద అన్నది.

చొరవగా వచ్చి స్నేహం చెయ్యగలదు. నక్సల్స్‌ని దాచి, పట్టుబడకుండా చేసిందిట. పని మనిషి, వంటమనిషి. కజిన్ అని చెపుతుందిట, తన కూతురుకు డాన్సు నేర్పుతున్న గురువని నమ్మించగలిగిందట సి.బి.ఐ. వాళ్ళుఒకటన్నా బయట పెట్టాలని ప్రయన్నిస్తున్నారట. యేవో ఫోన్లు చేసిపెట్టి అదాయంలో భాగాలు పెట్టి నోరు మూయిస్తున్నదిట. అదీ కేసయింది వాళ్ళబ్బాయి మత్తుమందుల వ్యసనానికి గురయ్యాడని పొక్కింది. కంప్యూటర్ కోర్స్ పూర్తిచేయ బోతున్నాడు. అమెరికా

పంపాలని చూస్తున్నది కూతురు పాప్ సంగీతంలో ఫస్ట్‌ప్రైజ్ కొట్టింది. బ్రేక్ డాన్సులో ఆరితేరింది. దాన్ని బాలీవుడ్‌లోకి తోలుతుందేమో. కూతుర్ని ఫ్రీగా తిరగనిస్తుంది. ఆ పిల్ల చీర గట్టగా నేనెన్నడూ చూడలేదు. జడ వేయగా చూడలేదు. జీన్సూ అమెరికన్ హెయిర్ స్టైయిలే వసంత తెలుసు గదూ రెడ్‌క్రాస్ మెంబరే. గైనకాలజిస్టు, అని అడిగింది చేప్పే ఆమె.

అందరూ తలలూపి యేమిటన్నట్టు చూశారు.

దాన్ని సంప్రదించడానికి వెళ్ళిందిట. రహస్యంగా పూర్తి చేసింది సభ్యురాలు.

ఉష్! ఇది జనరల్ వార్డు. డర్టీలినెన్ కడగ్గూడదు, అని నవ్వింది ఉమ. మరో సభ్యురాలు.

సుజనా నిన్న గూడా నువ్వు రాజూ యింట్లో కిచెన్‌లో కనిపించావే. యంక్వయిరీ జరిగేటప్పుడు పట్టుబడతావు. ప్రశ్న లేసి, నువ్వు తాగింది కల్లే అంటారు. మరో సభ్యవనిత సరస మాడింది.

మీరంతా పోనాడు తాటిచెట్టుకింద నించున్న వాళ్ళే. కళ్ళు అవునో కాదో నేను చెప్పలేను గాని మీరంతా తాటితాండ్ర తిన్న వాళ్ళే. అని సుజన నవ్వింది.

అందరూ మొహాలు చూసుకున్నారు.

"ఇంత తెలివిగలదానివీ, యింతదయగల తల్లివీ, అలా అన్ని నింద లెందుకెక్కాయి నీమీదికి?" అన్నది కనకరత్నం. ఆమె. కొత్త సభ్యురాలు.

విలువైన పట్టు గుడ్డలు, కట్‌పీసెన్‌షాపులో, రవి కలకని కొని టెయిలర్ కిస్తే అన్నీ పాడుచేశాడు దర్జీపట్టు పావడీ, వెండి జరీ వున్నది, శాటిన్‌స్కర్ట్‌గుడ్డ, మైసూర్ జార్జెట్ చీరకి ఫాల్ వేయాలి. అన్నీ పాడైపై చేతి మెషీన్ సింగర్ పాడుజేశాడు మంచిమెకానికు అందలేదు. ఊళ్లోలేడు.

సుజనతో స్నేహమైంది. సినీసంగీతం నేర్వాలని వచ్చేది అన్నీ చూపించి. విచారంగా చూసింది.

"బాధపడికండి. అన్నీ బాగుచేసి పెడతామ. చూతురు గాని. నాకు డిగ్రీ లేదుగానీ, మెషీను బాగు చేయగలను" అని నవ్వుతూ రోజు ఒకటి బాగుచేసి అందంగా కుట్టియిచ్చింది మెషీన్‌పూడదీసి విరిగినచోటు చూసి తీసేసి కొత్తది పెట్టి రన్ చేసింది. ఆయిల్ వేసింది.

పెట్టీకోట్ ఫిల్డ్‌వూడదీస్తు అడిగింది.

"యేమి విన్నారూ నన్ను గురించి నిందలా? అని నవ్వింది సుజన. నలుగురితో తిరగాల నుండి తిరిగాను తాటి చెట్టు కిందనిలబడి పాలుతాగాను. అని బాగా నవ్వింది. కనక రత్నం నవ్వింది

వాళ్లింటో వ టచేసి పెడితే, బంగాగాజు లిచ్చిందట రాజూ. అలా తీసుకునే మనిషిలాగా కనబడలేదు నాకు. అందు కనడిగా అన్నది.

బంగారంవి కావవి. ఇమిటేషన్. తెల్లరాళ్ళవి. తను వాడుకున్నాకే యిచ్చిందని. అందరం బజారుకెళ్లాము. నగల కొట్లో దూరాము. ఆరెండు గాజులూ అమ్మజూపాను.

ఇది బంగారం గాదమ్మా. అలా కనబడుతుంది. మోస పోయినారు. ఎగ్జిబిషన్‌లో కొన్నారా!? అనడిగాడందరెదుటా.

లేదు, కేరళ వంటకాలు నేర్పానని ప్రెజెంట్ చేసింది. అన్నాను. రాజూ నాపక్కనే వున్నది. పూరికేనే తమాషాకు అన్నాను, అని నవ్వేసింది. మళ్లా నవ్వింది సుజన.

సిల్క్ హౌస్‌లో అని అగింది కనకరత్నం.

"అదా! రెడ్‌క్రాస్‌కని చవకరకం తాను తెచ్చింది. కూడా నేనూ వున్నా. కాని బిల్ చెల్లించలేదు. రెడ్‌క్రాస్‌కి తానూ అందలేదని తెలిసింది. షాపువాడు నన్నడిగాడు. 'తెచ్చి యిప్పిస్తా అన్నాను. మళ్ళా చీరలు కొనాలని నన్ను తోడు రమ్మన్నప్పుడు నేర్పుగా కారులో పెట్టా. షాపులో దూరుతూ ఆమె వెనక నడుస్తు తాను తీసికెళ్ళి బల్లమీదుంచి ఆమె పర్సు బల్లమీదుంచితే ఓపెన్ చేశా.' దీనికి డబ్బు చెల్లించాలి. రెడ్ క్రాస్ కోసం తీసికెళ్ళాము.' అన్నాను. బాగా నవ్వేసింది.

'ఇది మరీ పాతస్టాక్. ఇది వద్దు త్వరగా చినిగి పోతుం దన్నారు. ఇచ్చేసేయ్. నేను మరిచిపోయినాను. బాగా గుర్తు చేశావు. థాంక్స్' అంటూ తాను వదిలి వచ్చేసింది."

సుజన నవ్వుతూ పెట్టికోట్ యిచ్చేసింది.